సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



ఇంటర్ సర్టిఫికెట్లు వచ్చేశాయ్!

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభ వార్త. పాస్ సర్టిఫికెట్లు జిల్లాకు చేరుకోవడంతో పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. - 8లో



రేపటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

జిల్లాకేంద్రంలో డేఅండ్‌నైట్ కూడలి వద్ద బుధ వారం నుంచి ట్రాఫిక్ మళ్లింపు అమలవుతుంది. డ్రైనేజీ పనుల నేపథ్యంలో నిబంధనలు అమలవుతాయి. - 8లో

12న నీలమణిదుర్గ హుండీ కానుకల లెక్కింపు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పాతప ట్నం నీలమణిదుర్గ ఆలయంలో హుండీ కానుకలను ఈ నెల 12న ఉదయం పది గంటలకు లెక్కించను న్నట్లు ఈఓ. టి.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలి పారు. దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తలు, భక్తుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందని, ఆసక్తిగల భక్తులు డ్రెస్‌కోడ్ పాటిం చి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి సాగర్ కవచ్



సిబ్బంది సూచనలిస్తున్న సీఐ గోవిందరావు

గార: తీర ప్రాంత చొరబాట్లను నిరోధించేం దుకు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు సాగర్ కవచ్ నిర్వహిస్తున్నామని కళింగ పట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ ఆర్.గోవింద రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గార, ఎచ్చెర్ల, శ్రీకా కుళం రూరల్, రణస్థలం, పోలాకి తదితర మండలాల్లో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల వద్ద మెరైన్ సిబ్బంది పహారా కాస్తారని చెప్పారు. రోడ్డు మార్గంలో సివిల్ పోలీసులు, సముద్రం లో కోస్టుగార్డు పహారా ఉంటుందని పేర్కొ న్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిబద్ధత, అంకితభా వంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. సోమవారం జిల్లా పరిష త్ సమావేశ మందిరంలో 12 మందికి కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ శ్రద్ధగా పనిచేయాలన్నారు. కార్య క్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్ ఓ ఎం.గణపతిరావు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసా గర్, ఉప కలెక్టర్ జయదేవి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో పొందూరు యువకుడికి స్వర్ణం



పతకం అందుకుంటున్న రాజశేఖర్

పొందూరు: నేపాల్‌లో ఈ నెల 5 నుంచి జరు గుతున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పొందూరుకు చెందిన గంటా రాజశేఖర్ సత్తాచాటారు. సీనియర్ విభాగంలో విజేతగా నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకు న్నాడు. రాజశేఖర్ తండ్రి శ్రీనివాసరావు, తల్లి పార్వతి సాధారణ కూలీలుగా పనిచేస్తున్నారు. పొందూరులోనే శిక్షణ తీసుకున్న రాజశేఖర్ అంతర్జాతీయ పోటీలలో రాణిస్తుండటంతో పలువురు అభినందనలు తెలియజేశారు.

రేపు శ్రీకాకుళంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 11న శ్రీకాకుళం నెహ్రూ యువకేంద్రం వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, జయభేరి ఆటోమోటివ్ కంపెనీల్లో ఖాళీగా ఉన్న పోస్టు లను అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగి 10వ తరగతి/ఇంటర్/డిగ్రీ/ఫార్మసీ, ఐటీ ఐ/డిప్లమో మెకానికల్/బీ.టెక్ మెకానికల్ విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. అపోలో ఫార్మసీకి ఎంపికైన వారు శ్రీకాకుళం, విశాఖ, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో పనిచే యాల్సి ఉంటుందని, జయభేరి ఆటోమోటి వ్‌కు ఎంపికైన వారు శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, రణస్థలం, పైడిభీమవరం తదితర ప్రాంతాలలో పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ, యువకులు బుధవారం ఉదయం 10.30 గంటలకు శ్రీకా కుళం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న నెహ్రూ యువకేంద్రం వద్దకు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు.

22న రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్/సోంపేట: ఉద్దాన ప్రాంతంలోని సోంపేట మండలం ఎర్ర ముక్కాం గ్రామంలో ఈ నెల 22న 'వే టూ సక్సెస్' గ్రూప్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఓపెన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రూపు వ్యవస్థాపక అధ్యక్షుడు చిడిపల్లి దామో దరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచే వారికి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. అసక్తి గల వారు 94903 88708 నంబర్‌ను సం ప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచిం చారు.

● న్యాయస్థానాల్లో నిరాశ..

ప్రజాకోర్టులో వృథా ప్రయాస

- అంతర్మథనంలో టీడీపీ శ్రేణులు
- చంద్రబాబుకు కోర్టుల్లో చుక్కెదురుతో తీవ్ర నిరాశ
- తలలు పట్టుకుంటున్న నాయకులు
- నిరసనలకు దూరమవుతున్న కార్యకర్తలు
- ముఖం చాటేసిన ప్రజలు
- వరుస పరిణామాలతో డీలా
- నిరసన కార్యక్రమాల కొనసాగింపుపై డైలామా



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: కంచాల మోత మోగ లేదు. కొవ్వొత్తుల క్రాంతి భ్రాంతిగా మిగిలిపోయిం ది. పోస్టుకార్డుల ఉద్యమం నడవలేదు. రిలే నిరాహార దీక్షలు సజావుగా సాగడం లేదు. ప్రజల సహకారం లేనిదే ఏ ఉద్యమం ముందుకెళ్లదు. పబ్లిక్‌లో స్పందన లేకపోతే ఎంత చేసినా ప్రయాసే మిగులుతోంది. జిల్లాలో టీడీపీ నేతలకు ఇప్పుడిదే పరిస్థితే ఎదురవుతోంది. కృత్రిమ ఉద్యమాలు, నిర సనలు ఎంత కాలం చేయగలమన్న అభిప్రాయానికి టీడీపీ శ్రేణులొచ్చేశాయి. పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమాలు నిర్వహించలేక.. అలాగని వదిలేయలేక టీడీపీ నాయకులు సతమత మవుతున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయిన చంద్రబాబునాయుడు వ్యవహారం టీడీపీ నేతలకు ప్రాణసంకటంగా తయారైంది.

ఆలోచనలు తలకిందులు..

టీడీపీకి ఉన్న వనరులు, వ్యవస్థల్లో ఉన్న వ్యక్తుల నేపథ్యంలో చంద్రబాబు అరెస్టు ఒక లెక్క కాదని.. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో జైలుకెళ్లినా వెంటనే వచ్చేస్తారని.. సాంకేతిక అంశాలతో కేసు కొట్టేస్తారనే అభిప్రాయంతో టీడీపీ నాయకులంతా తొలుత ఉండేవారు. ఈ రోజు.. రేపు లేదంటే కొన్ని రోజుల్లోనైనా చంద్రబాబు కేసు వీగిపోతుందని.. ఈ లోపు ప్రజల నుంచి సానుభూతి పొందొచ్చని ఆశించారు. కానీ డామిట్ కథ అడ్డం తిరిగినట్టు వాళ్ల ఆలోచనలన్నీ తలకిందులైపోయాయి. రోజు లు గడుస్తున్నా టీడీపీ నేతలు అనుకున్నది జరగడం లేదు. రోజులు.. వారాలు.. నెల గడిచిపోతున్నా వారి ఆశలు నెరవేరలేదు. ఎక్కే గడప దిగే గడప అన్నట్టుగానే చంద్రబాబు పరిస్థితి తయారైంది.

దేశంలో అత్యున్నత న్యాయవాదులు మూకుమ్మడి గా వచ్చి వాదిస్తున్నా కేసులో ఉన్న తీవ్రత దృష్ట్యా సానుకూల తీర్పులు రావడం లేదు. కేసు కొట్టేస్తా రనే స్థాయి నుంచి బెయిలైనా వస్తుందనే స్థాయి కి దిగిపోయారు. ఇక్కడ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభ కోణమనుకుంటే.. దానికి అమరావతి రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ నెట్‌వర్క్ స్కామ్.. ఇలా అవినీతి బాగోతాలన్నీ ఒక్కటై వెంటాడటంతో టీడీపీ నాయకులకు దిక్కుతోచని స్థితి ఎదురైంది.

ఆశలు అడియాశలు..

చంద్రబాబు బయటికొచ్చేలోపు పార్టీకి మైలేజ్, సానుభూతి రావాలన్న ఉద్దేశంతో తొలుత నిర సనలు చేపట్టారు. రాస్తారోకోలు నిర్వహించారు. బంద్‌కు పిలుపునిచ్చారు. పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. తర్వాత కంచాల మోత అన్నారు. లైట్లు ఆర్పేసి కొవ్వొత్తులతో కాంతులు అన్నారు. వీటిలో ఒక్కటీ జిల్లాలో విజయవంతం కాలేదు. అన్నీ ఫ్లాప్ అయ్యాయి. ప్రజలు సహకరించకపోవడం, మద్ద తుగా పాల్గొనకపోవడంతో పేలవంగా సాగాయి. ఎంతసేపూ ఆ పార్టీ ఇన్‌చార్జీలు మరికొంతమందిని సమీకరించి మమ అనిపించడం తప్ప ప్రయోజనం లేకుండా పోయింది. నయానో బయానో చేసి చివ రికీ రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. అవి కూడా పేలవంగానే జరుగుతున్నాయి. ఉదయం 10, 11 గంటలకు ప్రారంభించి, మధ్యాహ్నం భోజన సమ యానికి ముగించేస్తున్నారు. ఆ రెండు గంటలు శిబి రంలో కూర్చోబెట్టడానికి చేతి చమురు వదిలిం చుకుంటున్నారు. ఎంత ఖర్చు పెట్టినా శిబిరాలు నిండుతున్న పరిస్థితి లేదు.

టీవీల ముందు టీడీపీ శ్రేణులు..

చంద్రబాబు పిటీషన్లు విచారణకు వచ్చినప్పుడు టీడీపీ శ్రేణులు టీవీలకు అతుక్కుపోతున్నారు. తమ నాయకుడికి ఈ రోజైనా అనుకూల తీర్పు వస్తుందని ఆశతో చూస్తున్నారు. కానీ, కేసులో ఉన్న తీవ్రత, సీఐడీ అధికారులు సమర్పించిన ఆధారాలతో చం ద్రబాబుకు ఊరట లభించడం లేదు. వరుసగా ఎదు రుదెబ్బలు తగులుతున్నాయి. ఆశతో టీవీలు చూడ టం.. తీర్పులొచ్చాక నైరాశ్యంలోకి వెళ్లిపోతున్నారు. సోమవారమైతే జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కన్పిం చింది. తప్పకుండా చంద్రబాబు అనుకూల తీర్పులొ స్తాయని ఉదయం నుంచి టీవీల దగ్గర ఉన్నారు. కానీ, ఒక దాని తర్వాత ఒకటి అంటే హైకోర్టు, ఏసీబీ కోర్టుల ప్రతికూల తీర్పులు రావడంతో భయాందోళనలకు లోనయ్యారు. వాస్తవంగా సోమవారం అనుకూల తీర్పు వస్తే శిబిరాలు ఎత్తే ద్దామని భావించారు. ఆ మేరకు కేడర్‌కు సమా చారాన్ని షేర్ చేసుకున్నారు. కానీ, తమ ఆశలు అడి యాసవడంతో మరికొన్ని రోజులు రిలే దీక్షల శిబి రాలు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు.

● ఏం చేద్దాం..!



చంద్రబాబుకు మద్దతుగా కార్య క్రమాల నిర్వహణలో ప్రజలు సహక రించడం లేదు. కనీస మద్దతు ఇవ్వడం లేదు. దీంతో కార్యకర్తలపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు వారు కూడా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. డబ్బులు తీస్తే తప్ప శిబిరాలకు వచ్చే పరిస్థితి లేదు. అతికష్టం మీద కొంతమందిని ప్రతీరోజూ కూర్చోబె డుతున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ముగించే స్తున్నారు. అయినప్పటికీ ప్రతీరోజూ రిలే శిబి రాలు కొనసాగించడం టీడీపీ నేతలకు కష్టతరంగా మారింది. ఒకవైపు కోర్టుల నుంచి ప్రతికూల తీర్పులు రావడం, క్షేత్రస్థా యిలో స్పందన లేకపో వడంతో తలలు పట్టుకుం టున్నారు. చంద్రబాబు అవినీతి చేయడంతోనే జైలు కెళ్లారని.. తప్పు చేయక పోతే కోర్టుల్లో న్యాయం జరిగేదని.. బలమైన ఆధా రాలతో దొరకడం వల్లే కోర్టుల్లో వ్యతిరేక తీర్పులొ స్తున్నాయని.. అవినీతి జరగడం వల్లే కేసు బలపడి పోయిందనే అభిప్రాయానికి కార్యకర్తలు దాదాపు వచ్చేశారు. గతంలో ఎన్నో కేసులొచ్చినా చంద్ర బాబు తప్పించుకునేవారని, ఇప్పుడా పరిస్థితి లేక పోవడం వెనక స్కామ్ కేసు స్ట్రాంగ్‌గా ఉందనే ఆలోచనకొచ్చేశారు. దీంతో కార్యకర్తలు నిరసన కార్యక్రమాలకు రావడం లేదు. కేడర్ లేక శిబిరాలు రోజురోజుకూ వెలవెలబోతున్నాయి. ఏ నియోజక వర్గంలోనైతే రెండు గ్రూపులున్నాయో అక్కడ కొం తమేర నడుస్తున్నాయి. మిగతా అన్నిచోట్ల తుస్సు మంటున్నాయి. ముఖ్యంగా శ్రీకాకుళంలో గుండ లక్ష్మీదేవి, గొండు శంకర్ వర్గాలు, పాతపట్నంలో కలమట వెంకటరమణ, మామిడి గోవిందరావు వర్గాలు, ఎచ్చెర్లలో కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు, పలాసలో గౌతు శిరీష, మరో వర్గం ఉండటంతో ఎక్కడ గుర్తింపు కోల్పోతా మన్న భయంతో ఉనికిని చాటుకోవడానికి రిలే దీక్షలు కొంతమేర కొనసాగిస్తున్నారు.

కలెక్టర్ స్పందన @ 175



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక స్పందనకు వచ్చిన అర్జీలను అల సత్వం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కారా నికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమ స్యలను సావధానంగా వినాలన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించి స్పందన కార్యక్రమానికి 175 అర్జీలు వచ్చాయి. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఉప కలెక్టర్ జయదేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యా సాగర్ వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకి చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జేసీ నవీన్ మాట్లాడుతూ అన్ని విభా గాల అధిపతులు అర్జీల పట్ల శ్రద్ధ వహించి పరి ష్కారం చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం వెబ్ సైట్, టోల్‌ఫ్రీ నంబర్ 1902కు వచ్చే సమస్యలు సైతం సంబంధిత అధికారుల వద్దకు వెళ్తాయని, ఎప్పటికప్పుడు లాగిన్ ఓపెన్ చేసుకుని పరిశీలిస్తూ ఉండాలన్నారు. అలసత్వంవహిస్తే ఉపేక్షించేది లేద న్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, మెప్మా పీడీ కిరణ్, డీఎస్ఓ వెంకటర మణ, డ్వామా పీడీ చిట్టిరాజు పాల్గొన్నారు.

పోలీసు స్పందన @ 54



సమస్యను వింటున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 54 వినతులు వచ్చినట్లు ఎస్పీ జి.ఆర్.రాధిక తెలిపారు. స్పందన ఫిర్యాదులు చట్ట ప్రకారం కచ్చితంగా పరిష్కారం చూపాలని, పునరావృతం కాకూడదని ఎస్పీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వర రావు, జె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలోని మున్సిపా లిటీల్లో ఖాళీగా ఉన్న 28 వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం నగరపా లక సంస్థ కమిషనర్ చల్ల ఓబులేసు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో 12, ఆమదాలవల సలో 2, పలాస-కాశీబుగ్గలో 10, ఇచ్ఛాపురంలో 4 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీ ర్ణులై, వార్డుకు చెందిన వారు అర్హులని తెలిపారు. ఈ నెల 30వలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

త్వరలో జిల్లా కేంద్రంలో 132 కె.వి.సబ్‌స్టేషన్

- విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
- కొత్త ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణమూర్తి



ఎస్ఈ కృష్ణమూర్తికి అభినందనలు తెలియజేస్తున్న డివిజనల్ ఈఈలు

అరసవల్లి: జిల్లా కేంద్రంలో స్థల పరిశీలన కొలిక్కి వచ్చిన వెంటనే 132 కె.వి.సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, ఇది పూర్తయితే నగరం లో విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు ఉం డవని సర్కిల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం నూతన విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇం జినీర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేక రులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని పొన్నాడ రోడ్డు, ఆర్ట్స్ కళాశాల రహదారి వద్ద 132 కె.వి.సబ్ స్టేషన్ కోసం స్థల పరిశీలన చేస్తున్నారని, త్వరలోనే ఖరారు చేయనున్నామని వివరించారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమి స్తామని చెప్పారు. విజయనగరం ఆపరేషన్స్ ఈఈగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చానని, కింది స్థాయి ఉద్యోగుల పరిస్థితులపై పూర్తిస్థాయి అవగాహన ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వస్తు న్న విద్యుత్‌శాఖ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకం గా సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. కాంట్రాక్టర్లకు చెల్లింపుల పెండింగ్‌పై కార్పొరేట్ కార్యాలయంలో చర్చ జరుగుతోందని, త్వరలోనే సానుకూల నిర్ణయం రానుందని తెలిపారు. అనంతరం ఎస్ ఈకి సర్కిల్, డివిజనల్, సబ్ డివిజనల్ ఇంజినీర్లు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. కార్యక్ర మంలో శ్రీకాకుళం, టెక్కలి, పలాస ఆపరేషన్స్ ఈఈలు బయ్యన్నాయుడు, జి.శంకరరావు, జి.ప్ర సాదరావు, ఎస్ఏఓ తాతాచార్యులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో సేవలు భేష్



డీఎంఈ నరసింహంను సత్కరిస్తున్న వైద్యులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో రోగులకు ఉత్తమ సేవలు అందుతున్నట్లు తమకు నివేదికల ద్వారా సమాచారం అందిం దని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరసిం హం అన్నారు. సోమవారం పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు వచ్చిన ఆయన రిమ్స్ ఆస్ప త్రిని సందర్శించారు. ఆడిటోరియంలో జరిగిన వైట్‌కోట్ సెరమనీలో పాల్గొని మాట్లాడారు. వైద్య వృత్తి ఉన్నతమైనదని, దీనిని గుర్తెరిగి వైద్య విద్యార్థులు, డాక్టర్లు ముందుకు వెళ్లాల న్నారు. క్రమశిక్షణ ముఖ్యమన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు వైట్‌కోట్లు అందించి వాటి ప్రాధాన్యతను వివరించారు. అనంతరం డీఎంఈని వైద్యులు సత్కరించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, సూపరింటెండెంట్ డాక్టర్ స్వామినాయుడు, డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ పార్వతి, డాక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

చిక్కిన చిన్ని కృష్ణుడు

- మార్కెటింగ్‌శాఖ నిధుల స్వాహాలో కీలక పాత్రధారి చిన్ని కృష్ణ అరెస్ట్
- ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం 'కమిటీల్లో' నిధులు పక్కదారి
- బొక్కేసిన నిధులు రూ.3కోట్లు పైమాటే

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లానే కాదు రాష్ట్ర సహకార శాఖను కుదిపేసిన మార్కెటింగ్ కమిటీ నిధులు అక్రమ వ్యవహారంలో కీలక సూత్రధారి, గతంలో కార్యదర్శిగా పనిచేసిన ఎస్.చిన్నికృష్ణను జేఆర్ పురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీల్లో సెక్రటరీగా పనిచేసిన చిన్నికృష్ణ దాదాపు రూ. 3కోట్ల 22లక్షల 75వేల 819మేర నిధులు పక్కదారి పట్టించారు. దాదాపు 10 బ్యాంకు ఖాతాలకు ఈ నిధులను దారి మళ్లించారు. ఇందులో తన కార్యాలయంలో పనిచే సిన మరో ముగ్గుర్ని భాగస్వామ్యం చేసి ఇరికిం చారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న చిన్నికృ ష్ణతో పాటు కె.రామారావు, కె.మురళీకృష్ణ, ఉమా మహేశ్వరరావులతో పాటు పర్యవేక్షణలో వైఫల్యం చెందిన జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కాశేశ్వరరావును సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

కమిషనర్ ఆదేశాలతో ఫిర్యాదు..

అక్రమాలకు పాల్పడిన వీరిపై పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేసి, విచారణ జరిపించాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే ఆదేశించారు. ఈ క్రమంలో యుద్ధ ప్రాతిపదికన ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీలకు ఇన్‌చార్జి సెక్రటరీలుగా నియ మించి, వారి చేత సంబంధిత పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేయించారు. స్టేషన్‌లలో కేసులు నమో దయ్యాయి. విచారణ మొదలైంది. మరో వైపు శాఖా పరమైన విచారణ జరిగింది. చిన్నికృష్ణ పనిచే సిన ప్రతీ చోట విచారణ చేశారు. అవినీతి మొత్తం లెక్క ఇంకా అధికారికంగా తేలలేదు. ఈ క్రమంలో కీలక పాత్రధారి ఎస్. చిన్నికృష్ణను ఆదివారం విశా ఖపట్నంలో అదుపులోకి తీసుకుని సోమవారం అరెస్ట్ చేశామని జేఆర్‌పురం సీఐ ఆదాం 'సాక్షి'కి తెలిపారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీల్లో శ్రీకాకుళం జోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర స్కూల్‌గేమ్స్ వాలీ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు వేదికగా ఈ నెల 7 నుం చి 9 వరకు జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా బాలురు జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. టోర్నీలో అద్భు తమైన ఆటతీరుతో రాణించిన ఎ.తోషన్‌రామ్ (ఏపీ మోడల్ స్కూల్ పాతపట్నం), ఎ.ప్రేమ్‌కుమార్ (ఆర్‌సీఎం స్కూల్ వంగర) జాతీయ పోటీలకు ఎం పికయ్యారు. జిల్లా జట్టు ప్రదర్శన పట్ల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈవో కె.వెంకటేశ్వర రావు, కార్యదర్శి బి.వి.రమణ హర్షంవ్యక్తం చేశారు.



కంచిలి: కేసరపడలో నిర్వహించిన వైద్యశిబిరానికి తరలివచ్చిన గ్రామస్తులు

● ఆరోగ్యానికి ఆసరా!

పేదల ఆరోగ్యమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. జిల్లావ్యాప్తంగా సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాలకు రోగులు తరలివచ్చి వైద్యపరీక్షలు చేయించుకు న్నారు. రక్తపరీక్షల నిర్వహణతో పాటు స్పెషలిస్టు వైద్యసేవలు, అన్ని రకాల మందులు ఉచితంగా అందిస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి నెట్‌వర్క్



పాతపట్నంలో బీపీ, రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సేవలు బాగున్నాయి



కొన్నాళ్లగా కాళ్ల నొప్పులతో బాధపడుతు న్నాను. మా సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తు న్నారని తెలిసి వచ్చాను. దూరప్రాంత ఆస్పత్రులకు వెళ్లే అవసరం తప్పింది. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగానే మందులు అందజేశారు.

-రుగడ అసిరమ్మ, నీలమణిదుర్గ కాలనీ, పాతపట్నం



ఆమదాలవలస రూరల్: నిమ్మతొర్లాడలో రోగులకు మందులు అందజేస్తున్న సిబ్బంది



నరసన్నపేట: కోమర్తిలో నిర్వహించిన వైద్య శిబిరం వద్ద క్యూలో ఉన్న గ్రామస్తులు



టెక్కలి: ఆదిఆంధ్రావీధిలో వైద్య శిబిరంలో భాగంగా వృద్ధుడి నేత్రాలను పరిశీలిస్తున్న వైద్యులు

క్లుప్తంగా

రేపు గొండు పర్యటన

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్‌సీపీసీఆర్) సభ్యుడు గొండు సీతారాం ఈ నెల 11న శ్రీకాకుళం నగరంలో పర్యటించనున్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాపూజీ కళామందిర్‌లో జరిగే బాల్య వివాహ వ్యతిరేక సదస్సు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జరిగే సమీక్షలతో పాటు పలు పాఠశాలలను సందర్శిస్తారు.

జాతీయ ఫుట్‌బాల్ టోర్నీకి నరసన్నపేట విద్యార్థి


కె.నివాస్

నరసన్నపేట: స్థానిక పుండరీకాక్ష కాలనీకి చెందిన కె.నివాస్ జాతీయ స్థాయిలో నిర్వహించనున్న సీనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. అక్టోబర్ 13 నుంచి మహారాష్ట్రలోని కొల్హాపూర్ వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. అందులో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున నివాస్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. నరసన్నపేట డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న నివాస్ ప్రస్తుతం నరసన్నపేటలో ఫుట్‌బాల్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా సైతం బాధ్యతలు నిర్వహిస్తున్నాడని కోచ్ రాకేష్ తెలిపారు.

వడదెబ్బతో లారీ డ్రైవర్ మృతి


తాడి జానకిరామ్ మృతదేహం

పాతపట్నం: మండలంలోని తెంబూరు గ్రామానికి చెందిన తాడి జానకి రామ్ (55) వడదెబ్బతో సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడి జానకిరామ్ విజయనగరం జిల్లా పద్మానాభపురంలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడే కుటుంబంతో జీవిస్తున్నాడు. గతంలో ప్రమాదం జరగడంతో డ్రైవర్‌గా మానేశాడు. ప్రస్తుతం తెంబూరులో తల్లి తాడి సరస్వతి చూడడానికి ఈ నెల 2న వచ్చాడు. సోమవారం ఉదయం వెంకటాపురం సమీపంలో మధ్యాహ్నం వడదెబ్బకు గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సాయంత్రం విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: పోక్సోకేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించిందని విజయనగరం ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. కేసు వివరాలను ఆమె వెల్లడించారు. పాతపట్నం మండలం తామర గ్రామానికి చెందిన ధర్మాన ప్రసాదరావు అలియాస్ రుషికుమార్ ఓ బాలికపై లైంగిక నేరానికి పాల్పడడంతో విజయనగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం ప్రకారం దిశ మహిళా ఎస్‌ఐ కేటీఆర్.లక్ష్మి అప్పట్లో కేసు నమోదుచేశారు. అనంతరం అప్పటి విజయనగరం మహిళా దిశ డీఎస్పీ టి.త్రినాథ్ దర్యాప్తు పూర్తిచేసి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసును ప్రాధాన్యతా కేసుల జాబితాలో చేర్చి, ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తిచేశారు. నిందితుడు రుషికుమార్‌పై నేరం రుజువు కావడంతో స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు జడ్జి కె.నాగమణి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. కేసులో పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా, వన్‌టౌన్ కోర్టు కానిస్టేబుల్ త్రినాథరావు, దిశ హెడ్ కానిస్టేబుల్ దివ్యజ్యోతి సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారన్నారు. పోక్సో కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్షపడేలా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ అభినందించారు.

నవ్య కేసులో నలుగురు అరెస్టు

నరసన్నపేట: స్థానిక మారుతీనగర్ మొదటి వీధిలో వరకట్న వేధింపులు తట్టుకోలేక అనుమానాస్పదంగా మృతి చెందిన పొడుగు నవ్య కేసులో సోమవారం సాయంత్రం నలుగురిని డీఎస్పీ అరెస్టు చేసినట్లు నరసన్నపేట సీఐ ప్రసాదరావు తెలిపారు. నవ్య భర్త పొడుగు సంతోష్, అత్త హేమలత, ఆడపడుచులు కొత్తకోట మాధవి, జామి లక్ష్మి(మానస)లను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐ వై.సింహాచలం వీరిని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

ఉత్సాహ తరంగం...


ముఖ్యమంత్రితో స్పీకర్ తమ్మినేని సీతారాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో విజయవాడలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశానికి శ్రీకాకుళం జిల్లా నుంచి పార్టీ ముఖ్యనేతలు హాజరయ్యారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించారు.


ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


ఎమ్మెల్సీ నర్తు రామారావు


కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్


జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఇచ్ఛాపురం సమన్వయకర్త పిరియా సాయిరాజ్


తూర్పుకాపు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు

నాడు-నేడు బిల్లులు పెండింగ్‌లో లేవు


సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

అరసవల్లి: జిల్లాలో నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామని, వీటికి సంబంధించి కాంట్రాక్టర్లకు ఎలాంటి బిల్లులు పెండింగ్‌లు లేవని, ఇక మరింత వేగంగా పనులు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.32 కోట్ల వరకు నిధులు నాడు–నేడు వినియోగానికి అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రణస్థలం, సోంపేట, జలుమూరు, పొందూరు మండలాల్లో ప్రగతి కనిపించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న మంగళవారం నిర్వహించనున్న సమీక్షలో పూర్తి వివరాలతో సమీక్షకు హాజరుకావాలని ఎంఈఓకు సూచించారు. జిల్లాలో ఎక్కడా సిమ్మెంట్, ఇసుక కొరత లేదని, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ఎప్పటికప్పుడు అధికారులు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. సమీక్షలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సమగ్ర శిక్ష పీఓ డాక్టర్ ఆర్.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం సేవలు చిరస్మరణీయం


కాన్షీరాం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మానవతావాది, దళిత–బహుజనుల హక్కుల సాధనకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాలను ఐక్యం చేసి బహుజనుల రాజ్యాధికారానికి కృషి చేసిన మహోన్నత శక్తి కాన్షీరాం అని వక్తలు పేర్కొన్నారు. సోమవారం ఆయన వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పార్కులో కాన్షీరాం విగ్రహానికి బహుజనులు, బీసీ, దళిత నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీసీ, దళిత సంఘాల నాయకులు కల్లేపల్లి రామ్‌గోపాల్, జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పిట్టా చంద్రపతిరావు, తెక్కాండో శ్రీను, కంఠ వేణు, బీసీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ఆగూరి ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, బి.వి.రమణ, పిట్టా హేమసుందర్, బీన ఢిల్లీరావు, ఎల్.అనంతరావు, గుణుపూరు నరసింగరావు, బోడల రాజారావు, లింగాల గరికివాడు, లావ సోమేశ్వరరావు, అర్జి ఈశ్వర్, ఆదపాక రాంబాబు, రంగాజీదేవ్, నాగరాజు, పేరూరి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ కో ఆర్డినేటర్ గుంట మంజులాదేవి, నక్క అప్పలరాజు, లండ అప్పన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పతకాల పంట


పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని మహాలక్ష్మినగర్ కాలనీలో కెన్యూరియో కరాటే విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటారు. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో రని, కటా, కుమిటీ విభాగాల్లో ఎనిమిది పతకాలు కైవసం చేసుకున్నట్లు కరాటే చీఫ్ రెడ్డి ఢిల్లేశ్వరరావు తెలిపారు. అందులో 2 స్వర్ణం, 2 రజతం, 4 కాంస్య పతకాలు ఉన్నట్లు చెప్పారు. విజేతలకు ఏపీ కరాటే చీఫ్ కె.సుమన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ రెడ్డి ఢిల్లేశ్వరరావును శ్రీ చైతన్య కళాశాల యాజమాన్య ప్రతినిధులు సోమవారం అభినందించారు.

జీడిపప్పు పరిశ్రమలో అగ్ని ప్రమాదం

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డులోని శ్రీలక్ష్మి కాజూ ఇండస్ట్రీలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. పొగలు వస్తున్నాయని స్థానికులు సమాచారం అందించడంతో యజమాని సకలాభక్తుల అనిల్ వెళ్లి చూసేసరికి ఫ్యాక్టరీలో సుమారు 800 కేజీల జీడిపిక్కలు కాలిబూడిదైనట్లు గుర్తించారు. బాయిలింగ్ కోసం ఆటోమెటిక్ యంత్రంలో పెట్టి ఇంటికి వెళ్లిపోయామని, సమయానికి ఆగకపోవడంతో పిక్కలు మాడిపోయాయని యజమాని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందని చెప్పారు.

ఇంటర్ సర్టిఫికెట్లు వచ్చేశాయ్!

- విద్యార్థులకు అందజేస్తున్న కళాశాలల యాజమాన్యాలు
- 'డిజీలాకర్' యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు


కొయ్యాం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ కె.తవిటినాయుడు, లెక్చరర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ఒరిజినల్(పాస్) సర్టిఫికెట్లు ఎట్టకేలకు విద్యార్థులకు చెంతకు చేరుతున్నాయి. ఇప్పటికే జూనియర్ కాలేజీలకు చేరిన ఇంటర్మీడియెట్ మార్క్స్ మెమోలను పకడ్బందీగా అందజేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. వివిధ కారణాలతో పంపిణీలో కాస్త జాప్యం జరిగినప్పటికీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి విద్యార్థులకు త్వరితగతిన చేరేలా చొరవ తీసుకున్నారు. మొత్తంమీద తమకు పాస్ సర్టిఫికెట్లు అందించడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.


విద్యార్థులతో కళకళ..

పాస్ సర్టిఫికెట్ల కోసం వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కళాశాలలు కళకళలాడుతున్నాయి. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఈ ఏడాది మార్చి 15 నుంచి నెలాఖరు వరకు పబ్లిక్ పరీక్షలు జరిగాయి. అనంతరం సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి నెలాఖరు వరకు నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులతోపాటు గతంలో ఫెయిలైన విద్యార్థులు కలిసి 39410 మంది పరీక్షలు రాశారు. ఇందులో 20650 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిందరి మార్క్స్ మెమోలు జిల్లాకు చేరుకున్నాయి. జిల్లా ఇంటర్‌బోర్డు కార్యాలయం నుంచి వెనువెంటనే కాలేజీలకు చేరేలా డీవీఈవో కోట ప్రకాశరావు నేతృత్వంలో ఆర్‌ఐఓ పి.దుర్గారావు, సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు. కాలేజీలకు హాజరవుతున్న విద్యార్థులకు డిజీలాకర్ యాప్‌పై ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఈ యాప్‌లో అన్ని సర్టిఫికెట్లు లభ్యమౌతున్నాయని తెలియజేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలిపి 191 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఫంక్షనింగ్ జరుగుతున్న కళాశాలలు 168. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, సోషల్ వెల్ఫేర్ 9, ట్రైబల్ వెల్ఫేర్ 1, మోడల్‌స్కూల్/కళాశాలలు 13, కేజీబీవీలు 25, జెడ్పీహెచ్ స్కూల్ కాలేజీలు 5, కోపరేటివ్ 2, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 73 ఉన్నాయి. వీటిల్లో ప్రథమ ద్వితీయ సంవత్సరం కలిపి 49490 మంది విద్యార్థులు చదువుతున్నారు.

అన్ని కాలేజీలకు చేరవేశాం..



ఇంటర్మీడియెట్ పాస్ సర్టిఫికెట్లు(మార్క్స్ మెమోలు) జిల్లాకు చేరిన వెంటనే కాలేజీలకు అందజేసేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులకు త్వరితగతిన పంపిణీ చేసేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సిబ్బంది, అధ్యాపకుల ద్వారా విద్యార్థులకు సమాచారం అందించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలా ఆదేశించాం.

– పి.దుర్గారావు, ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్‌ఐఓ, శ్రీకాకుళం జిల్లా


'డిజీలాకర్'పై అవగాహన..



ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పాస్ సర్టిఫికెట్ల అందజేసే ప్రక్రియ వాయువేగంతో సాగుతోంది. డిజీలాకర్ యాప్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నాం. ఇన్‌స్టాల్ మొదలు పనిచేసే విధానంపై ఇప్పటికే ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పించాం. విద్యార్థులతోపాటు సామాన్యులకు సైతం చాలా ఉపయుక్తమైన యాప్ డిజీలాకర్.

– కోట ప్రకాశరావు, ఇంటర్మీడియెట్ విద్య, శ్రీకాకుళం డీవీఈవో

రేపటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు



ట్రాఫిక్ మళ్లింపు రూట్ మ్యాప్


ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాదరావు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని డే అండ్ నైట్ కూడలిలో అండర్ డ్రైనేజీ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 11 నుంచి ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నట్లు ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడు రోడ్ల కూడలి నుంచి కృష్ణా పార్కు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సు వరకు ట్రాఫిక్ మళ్లింపు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. పనులు పూర్తయ్యే వరకు వాహనచోదకులు సహకరించాలని కోరారు.

రూట్-1 : ఏడు రోడ్ల కూడలి నుంచి కృష్ణాపార్కు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సుకు వెళ్లదలిచిన వాహనచోదకులు(కారు, ఆటో, బైకులు) డే అండ్ నైట్ వద్ద ఎడమ వైపునకు తిరిగి సింధూర కూడలి మీదుగా సింధూర ఆసుపత్రి, ఆర్ట్స్ కళాశాల రోడ్డు – అంబేడ్కర్ కూడలి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సు వైపుకు వెళ్లాలి.

రూట్-2 : ఎన్‌హెచ్–16 ఆర్చి కూడలి, కిమ్స్ ఆస్పత్రి మీదుగా టౌన్‌లోకి వచ్చే వాహనచోదకులు(కారు, ఆటో, బైకులు) సింధూర కూడలి వద్ద ఎడమ వైపునకు తిరిగి సింధూర ఆసుపత్రి, ఆర్ట్స్ కళాశాల రోడ్డు, అంబేడ్కర్ కూడలి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సుకు వెళ్లవచ్చు.

రూట్ -3: ఆర్టీసీ కాంప్లెక్సు వైపు నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా ఏడురోడ్ల కూడలి వైపు వెళ్లదల్చిన వాహనచోదకులు (కారు, ఆటో, బైక్‌లు) డేఅండ్ నైట్ కూడలి మీదుగా ఏడురోడ్ల కూడలి వైపు వెళ్లవచ్చు.

- విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం నగరంలోకి ప్రవేశించే ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ఎన్‌హెచ్–16 ఆర్చి కూడలి వైపు నుంచి రాకుండా కొత్తరోడ్డు – బలగ కూడలి – రిమ్స్ ఆస్పత్రి కూడలి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సుకు చేరుకోవాలి.
- శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి విశాఖపట్నం, విజయనగరం వైపు వెళ్లదల్చిన ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు డేఅండ్‌నైట్ కూడలి వైపు రాకుండా రిమ్స్ ఆసుపత్రి కూడలి మీదుగా బలగ కూడలి– కొత్తరోడ్డు – ఎన్‌హెచ్–16కు వెళ్లాలి.
- ఆర్టీసీ కాంప్లెక్సు వైపు నుంచి ఏడు రోడ్ల కూడలి వైపు, ఓటీఎస్ (పాతబస్టాండు) నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వైపు రాకపోకలకు బస్సులకు అనుమతి లేదు.

15న ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మెట్ట అశోక్, సంపతిరావు సూరిబాబు, అనిల్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో ఈ నెల 15న నిర్వహిస్తున్న లలిత హోండా ఓపెన్ పురుషుల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను విజయవంతం చేయాలని శ్రీకాకుళం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రామలక్ష్మణ రోడ్డులోని లలిత హోండో షోరూం ఎండీ ఆకుల ప్రదీప్, మేనేజింగ్ పార్టనర్ జి.భీమారావుల స్పాన్సర్‌షిప్‌తో నిర్వహిస్తున్న మెన్స్ డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు సంబంధించి బ్రోచర్‌ను సోమవారం శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్‌పై మక్కువ కలిగిన వారు ఎవరైనా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వయసుతో సంబంధం లేదన్నారు. కేవలం డబుల్స్ విభాగంలో పురుషులకు మాత్రమే పోటీలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. విజేతలకు రూ.20వేల నగదు బహుమతులు, మెమెంటోలు, ప్రసంశాపత్రాలను అందజేస్తామన్నారు. క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 13వ తేదీ సాయంత్రంలోగా 94402 55255 నంబర్‌ను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ రుసం రూ.500గా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈవో సంపతిరావు సూరిబాబు, జిల్లా కోశాధికారి గోర అనిల్‌కుమార్, కోచ్ కిల్లి ఢిల్లేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్‌లు కె.సాయికుమార్, కె.క్రాంతి తదతరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి


జన్ని అశ్విని(ఫైల్)

మెళియాపుట్టి: పెళ్లయిన ఆరు నెలలకే వివాహిత మృతి చెందిన సంఘటన మెళియాపుట్టి మండలంలోని ముకుందాపురం పంచాయతీ పరశురాంపురంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పరశురాంపురం గ్రామానికి చెందిన జన్ని కృష్ణారావుతో పొగడవెల్లి గ్రామానికి చెందిన జన్ని అశ్విని (21) మార్చిలో వివాహం జరిగింది. అశ్విని సోమవారం మధ్యాహ్నం బహిర్భూమికని గ్రామశివారు ప్రాంతానికి వెళ్లింది. అక్కడి నుంచి వచ్చిన తర్వాత నోటి నుంచి నురగలు కక్కుతూ, మాట్లాడలేని స్థితిలో ఉండటంతో వెంటనే కుటుంబసభ్యులు ఆటోలో మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బయలుదేరారు. ఆస్పత్రికి చేరేలోపే మృతిచెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించనున్నట్లు తెలిసింది.

బారువకొత్తూరులో ఇల్లు దగ్ధం


కాలి బూడిదైన వస్త్రాలు చూపిస్తున్న బాధితులు

సోంపేట: మండలంలోని బారువ మేజర్ పంచాయతీ బారువ కొత్తూరులో సోమవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో పిట్ట సూర్యనారాయణకు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటనలో డ్వాక్రా రుణం రూ.లక్ష నగదు, టైలరింగ్ కోసం గ్రామస్తులు ఇచ్చిన సుమారు రూ.50 వేలు విలువైన వస్త్రాలు, నిత్యావసర వస్తువులు, సామగ్రి కాలి బూడిదైనట్లు బాధితులు తెలిపారు. సుమారు రూ.మూడు లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

SUDA లే అవుట్, పైడి భీమవరం జం॥ NH ఫేసింగ్, కమర్షియల్ & రెసిడెన్సియల్ ప్లాట్స్ అమ్మకం. 40 ఫీట్ రోడ్స్, స్పాట్ రిజిస్ట్రేషన్, లోన్ సౌకర్యం కలదు. ఫోన్ : 98851 28080 [V-2184]

WANTED

LIFE RAY హాస్పిటల్, న్యూబ్రిడ్జి రోడ్, సింహ ద్వారం దరి, శ్రీకాకుళంలో పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ & బిల్లింగ్ అనుభవం ఉన్న రిసెప్షనిస్ట్, OT అసిస్టెంట్స్ కావలెను. సెల్: 6301260891 [S-771130]

మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 72077 76136. [M-1221760]

హైదరాబాదులో అప్తా ఎల్డర్‌కేర్‌లో ఉద్యోగ అవకాశం. M/F కేర్ టేకర్స్ కావలెను. జీతం: 16–20వేలు, వయస్సు: 21–45, భోజన వసతి ఇన్సూరెన్స్ కలవు. సంప్ర॥ 6300813664 [G-1140]

కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 13,000/- - 35000/- ఫ్రీ రూమ్ + భోజనం. HYD Ph: 8919613984 [HA-707]

ఫార్మ-డి ఇంటెన్‌షిప్ డ్యూటి డాక్టర్స్, MPHW కంప్లీట్ ఐనవారికి అప్రెంటిషిప్ నర్సెస్ కొత్తవారికి ప్రాధాన్యత ఉచిత వసతి, అహల్య నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 9246427459 [G-1150]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.